కాచిగూడలో మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో మంచినీటి ఎద్దడి నివారణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. డివిజన్‌లోని మణీయర్‌పట్టి, కుత్బీగూడ, చప్పల్‌బజార్ తదితర ప్రాంతాలలో మంచినీటి పైప్‌లైన్ల మరమ్మతు పనులను జలమండలి ఏఈ భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌యాదవ్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ బస్తీల్లో మంచినీటి పైప్‌లైన్‌ను పరిశీలించి నీటి లీకేజీలకు మరమ్మతులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు మల్లికార్జున్, శంకర్, రేణమ్మ, సుజాత, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రామకృష్ణ, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ్‌నగర్‌లో కలుషిత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

అంబర్‌పేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్‌లోని ప్రేమ్‌నగర్‌లో కలుషిత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. గురువారం ఆయన ప్రేమ్‌నగర్ ఓల్డేజ్ హోం ప్రాంతంలో పాదయాత్ర నిర్వహించారు. స్థానికులు ఎదుర్కొంటున్న లోప్రెషర్ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

9న తెలంగాణ ఉద్యమకారుల మహిళా శిక్షణా తరగతులు

రాంనగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల మహిళా వేదిక ఆధ్వర్యంలో ఈనెల 9న ఆదివారం ఉప్పల్ మేడిపల్లిలో ఉద్యమకారుల మహిళా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్‌యాదగిరి తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో రచయిత్రి గోగు శ్యామల, జూపాక సుభద్రతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి ప్రఫుల్ రాంరెడ్డి, మహిళా వేదిక నాయకురాలు జె.ఇందిరా, పి.ధనలక్ష్మి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని యువకుడి మృతి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని యువకుడు మృతిచెందాడు. కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... గురువారం ఉప్పుగూడ- యాకత్‌పుర రైల్వే స్టేషన్ల యువకుడు(30) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. తీవ్ర గాయాలవడంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

'విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్‌ను పెంచుకోవాలి'

రాంనగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్‌ను పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన పలువురు ప్రిన్సిపాళ్లు సూచించారు. గురువారం విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రిలయన్స్ ఫౌండేషన్, కళాశాల కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వారం రోజుల నైపుణ్య శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభు, ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్ర కుమార్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కామర్స్ శాఖాధిపతి డాక్టర్ జె.అనితారాణి, డాక్టర్ పి.పద్మజ, డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శంకరమఠంలో హరికథ సప్తాహం

రాంనగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నల్లకుంటలోని శంకరమఠంలో గురువారం కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగిన హరికథ సప్తాహం కార్యక్రమానికి కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతాకల్యాణం హరికథ నిర్వహించిన లక్ష్మీనారాయణ భాగవతార్‌ను ఆయన సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచికుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం కేంద్ర బడ్జెట్‌ను స్వాగతిస్తూ ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, పార్టీ నాయకులు పూసరాజు, సదానంద్ ముదిరాజ్, అనిల్‌కుమార్, సత్యనారాయణ, ఆయుష్‌రాజు పాల్గొన్నారు.

-ముషీరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి)

● వైద్య శిబిరం



వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం అడిక్‌మెట్ డివిజన్ విద్యానగర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు.

- రాంనగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి)

● సత్కారం



ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం ఆమోదం తెలిపిన నేపథ్యంలో మంత్రి దామోదర రాజనర్సింహను సత్కరిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ డాక్టర్ సెల్ చైర్మన్ డాక్టర్ సుధాకర్‌యాదవ్, తదితరులు

- కవాడిగూడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి)

అవకాశం కల్పించండి



కాంగ్రెస్ పార్టీకి నాలుగు దశాబ్దాలుగా అంకితభావంతో సేవలందించిన తనకు నామినేటెడ్ పదవులలో అవకాశం కల్పించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ డెవలప్‌మెంట్ అధ్యక్షుడు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు గజ్జెల దశరథ్ గురువారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి తన బయోడేటాను అందజేశారు.

- రాంనగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి)

● అభినందనలు



బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన లంకాల దీపక్‌రెడ్డిని బీజేపీ నగర కార్యాలయంలో కలిసి అభినందనలు తెలియజేస్తున్న ఆ పార్టీ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు నరేష్‌గౌడ్, నాయకులు దాసోజు నాగభూషణంచారి, దయాకర్‌యాదవ్ తదితరులు

- అంబర్‌పేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి)

● సన్మానం



నగరంలో జరిగిన జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో జమ్మూకశ్మీర్‌కు చెందిన యువతీ, యువకుల జట్టు మొదటి స్థానంలో నిలిచింది. ఆ జట్టును శాలువా పూలబొకేతో సన్మానిస్తున్న బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కోశాధికారి, సినీ నటుడు డాక్టర్ షేక్ రహ్మతుల్ల తదితరులు

- బర్కత్‌పుర, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి)

అక్కడ 10 అడుగులలోపే..?

అంబర్‌పేట వంతెన దిగే చోట ఇరుకుగా సర్వీస్ రోడ్లు

- గోల్నాక వైపూ అదే దుస్థితి
- ప్రమాణాల ప్రకారం 23 నుంచి 25 అడుగులు
- ఆస్తుల సేకరణపై చేతులెత్తేసిన జీహెచ్ఎంసీ
- సర్వీస్ రోడ్డు నిర్మాణంపై సందిగ్ధత
- ప్రారంభోత్సవంపైనా లేని స్పష్టత..?
- ఇప్పటికే ఆ మార్గంలో జామ్‌జాటం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట ఛే నెంబర్ వంతెన భూసేకరణలో మతలబు జరిగిందా..? రహదారి అభివృద్ధి ప్రణాళిక (ఆర్‌డీపీ) మేరకు రోడ్డు విస్తరించలేదా..? మార్కింగ్ దశలోనే కొన్ని నిర్మాణాలకు మినహాయింపునిచ్చారా..? క్షేత్రస్థాయి పరిస్థితులు చూస్తే ఔనేమో అన్న అనుమానం కలుగుతోంది. వంతెన దిగే చోట అటు అంబర్‌పేట, ఇటు గోల్నాక వైపు సర్వీస్ రోడ్లు ఇరుకుగా మారాయి. ఆయా ప్రాంతాల్లో కనీసం 10 అడుగుల వెడల్పు కూడా రోడ్డు లేదు. దీంతో ఇప్పటికే అంబర్‌పేట గాంధీ బొమ్మ వద్ద ట్రాఫిక్ జామ్ అవుతోంది. గోల్నాక వైపు వాహనాల రాకపోకలు అనుమతించడం లేదు. ఆర్‌డీపీ ప్రకారం ఆస్తుల సేకరణ చేపట్టక.. నిర్ణీత స్థాయిలో విస్తరణ జరగకపోవడం వల్లే దుస్థితి నెలకొందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. శ్మశాన వాటిక వద్ద డిజైన్ మార్చి పోర్టల్ ఫ్రేమ్‌లు నిర్మించడంతో అక్కడా రహదారి ఇరుకుగా మారింది. అంబర్‌పేటలో ఆస్తుల సేకరణ ఆది నుంచి వివాదస్పదంగా మారింది. పరిహారం తీసుకొని కొందరు కోర్టుకు వెళ్లగా.. ఇంకొందరు యజమాన్యపు హక్కులు మావంటే మావని క్లెయిమ్ చేశారు.



ఉన్నతస్థాయి ఒత్తిళ్లతో అప్పటి పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు అవసరం మేరకు ఆస్తులు సేకరించలేదన్న ఆరోపణలున్నాయి. వంతెన కోసం 281 ఆస్తులు సేకరించారు. అయితే, గాంధీ బొమ్మ నుంచి ముక్రం హోటల్ వరకు ఇరువైపులా తక్కువ ఆస్తులు మార్కింగ్ చేయడం వల్లే రహదారి ఇరుకుగా మారిందని చెబుతున్నారు.

✦ హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారి(163)పై అంబర్‌పేట ఛే నెంబర్, శ్రీరమణ చౌరస్తాల వద్ద సిగ్నల్ చిక్కులు లేని ప్రయాణం కోసం రూ.467.55 కోట్లతో జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దాదాపు ఆరున్నరేళ్లు సా...గిన పనులు తుది దశకు చేరుకున్నాయి. వంతెన నిర్మాణం పూర్తి కాగా.. కింద వాహనాల రాకపోకల కోసం సర్వీస్ రోడ్లు నిర్మించాల్సి ఉంది. ఇక్కడే అసలు సమస్య మొదలైంది.



గాంధీ బొమ్మ నుంచి రామంతాపూర్ వైపు వెళ్తోన్న మార్గంలో ఇరుకుగా సర్వీస్ రోడ్డు

వెడల్పు తక్కువగా ఉండడంతో సర్వీస్ రోడ్డు నిర్మించాలా..? వద్దా... అన్న దానిపై ఎన్‌హెచ్ఏఐ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. విస్తరణపై జీహెచ్ఎంసీ నుంచి స్పష్టత లేకపోవడంతో.. ప్రస్తుతం ఉన్నంత మేర రోడ్డు నిర్మించే విషయంలో ఉన్నత స్థాయిలో చర్చిస్తున్నట్టు ఓ అధికారి తెలిపారు. ప్రమాణాల ప్రకారం జాతీయ రహదారులపై వంతెనల వద్ద కనీసం 7 నుంచి 7.5 మీటర్ల మేర (23 నుంచి 25 అడుగులు) సర్వీస్ రోడ్డు ఉండాలి. ఆ మేరకు వెడల్పు లేకుండా రహదారి నిర్మిస్తే.. మున్ముందు ఏదైనా దుర్ఘటన జరిగితే ఎలా అన్న ఆందోళన అధికారుల్లో వ్యక్తమవుతోంది. సర్వీస్ రోడ్లు విస్తరించకుండా వంతెన నిర్మించడం వల్ల ప్రయోజనం ఉందని, లోకల్ ట్రాఫిక్‌కు తిప్పలు తప్పవని పలువురు పేర్కొంటున్నారు.

తెలంగాణ ప్రజలకు ఉద్యమస్ఫూర్తిని కలిగించిన దాశరథి



శ్రీనివాసమూర్తి, రామాచారిలను సన్మానిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): దాశరథి కృష్ణమాచార్య తెలంగాణ ప్రజలకు ఉద్యమస్ఫూర్తిని కలిగించారని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. తేజస్విని కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం త్యాగరాయగానసభలో ప్రఖ్యాత కవి దాశరథి కృష్ణమాచార్య శతజయంతి మహోత్సవం వైభవంగా జరిగింది. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని డీఆర్‌డీఎల్ డైరెక్టర్ డా. శ్రీనివాసమూర్తిని జీవితసాఫల్య పురస్కారంతో సత్కరించారు. ప్రముఖ గాయకుడు కె.రామాచారికి బాల గంధర్వ సారథి బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పవర్నర్ మాట్లాడుతూ నా తెలంగాణ కోటి రతనాల వీణ అని తన కవితాధారలతో ప్రజల పక్షాన నిలిచి నాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన దాశరథి కృష్ణమాచార్య సాహిత్య చరిత్రలో శాశ్వతంగా ఉంటారని అన్నారు. అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘం పూర్వ అధ్యక్షుడు విజయబాబు మాట్లాడుతూ నిజాంకు వ్యతిరేకంగా పోరాడినా, సినీ పాటలు రాసినా దాశరథిలో మానవీయకోణం కనిపిస్తుందన్నారు. బీజేపీ నేత మురళీధరరావు మాట్లాడుతూ రాజాశ్రయం కోరకుండా నిజాంను ధిక్కరించి నిలిచిన దాశరథి శాశ్వతంగా నిలిచి ఉంటారన్నారు. సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ దాశరథి పదాలలోని అర్థాన్ని వివరించి ఆకట్టుకున్నారు. సంస్థ నిర్వాహకులు ఎస్‌బి సుధాకర్ స్వాగతం పలుకగా కార్యదర్శి రాణి సుధాకర్ రాష్ట్ర గవర్నర్‌ను సత్కరించారు. కాగా ప్రతిభావంత వైద్యులకు వైద్య శిరోమణి అవార్డులు గవర్నర్ ప్రదానం చేశారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి



ముషీరాబాద్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల నూతన కమిటీ

రాంనగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యా ప్రమాణాలు మెరుగుపరిచే విధంగా పాఠశాలల యాజమాన్యాలు కృషి చేయాలని ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల కమిటీ అధ్యక్షుడు మధుసూదన్ సూచించారు. ముషీరాబాద్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల కమిటీ సర్వసభ్య సమావేశం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగింది. ఈసందర్భంగా ఆయన ముషీరాబాద్ మండలం నూతన కమిటీని ప్రకటించారు.

ముషీరాబాద్ మండల నూతన కమిటీ

ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల ముషీరాబాద్ మండలం నూతన కమిటీ అధ్యక్షుడిగా సయ్యద్ మహ్మద్ భక్తియార్, ప్రధాన కార్యదర్శిగా అంకం శ్రీకాంత్, కోశాధికారిగా సి.మురళీధర్, ఉపాధ్యక్షుడిగా ఎన్.సంజయ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం ముషీరాబాద్ మండలం డిప్యూటీ డీఈవోగా బాధ్యతలు నిర్వహించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన చిరంజీవిని, డిప్యూటీ ఐవోఎస్ జయలక్ష్మి, నూతన డిప్యూటీ డీఈవోగా వచ్చిన శ్రావణ్‌కుమార్, డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణిలను ఈ సందర్భంగా వారు సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు రఘు, ప్రకాష్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, ఉమామహేశ్వర్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

'వర్గీకరణపై రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలి'

నల్లకుంట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ విషయంలో రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలని జై భీమ్ సేన ఫైట్ ఫర్ రైట్ రాష్ట్ర అధ్యక్షుడు పి.బల్వంత్‌రావు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే పంచాయతీరాజ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మాలలు ఓటు ద్వారా బుద్ధిచెబుతామని హెచ్చరించారు. గురువారం హైదర్‌గూడలో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ఏ గ్రామంలో ఏ కులాలు వెనుకబాటుకు గురయ్యాయో క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయకుండా, ఏ కులాల జనాభా ఎంత ఉందో తేల్చకుండా ఏకసభ్య కమిషన్ ఇచ్చిన రిపోర్టు తప్పులతడకగా ఉందని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం దేశవ్యాప్తంగా కులగణన చేసిన తర్వాతనే ఎస్సీ వర్గీకరణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

'బీసీ జనాభా లెక్కల వివరాలు ఇవ్వాలి'

చిక్కడపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బీసీల జనాభా లెక్కలపై కులాలవారీగా వివరాలు ఇవ్వాలని బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన బీసీ మేధావులు, కుల సంఘాలు, ప్రజాప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి బీసీ జనాభాపై ఉన్న పలు అనుమానాలను నివృత్తి చేయాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు.

ఎండీఎంఏ డ్రగ్స్, ఓజీ కుష్ గంజాయి పట్టివేత

● మరో కేసులో 2.6 కేజీల గంజాయి స్వాధీనం ● రెండు కేసుల్లో ఐదుగురు నిందితుల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేసిన ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ (స్టేట్ టాస్క్‌ఫోర్స్) 25 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్, 8 గ్రాముల ఓజీ కుష్ (మేలు రకం అమెరికా గంజాయి), 2.6కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రెండు కేసుల్లో కలిపి ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సమీపంలో డ్రగ్స్ అమ్మకాలు జరుపుతున్నారనే సమాచారం మేరకు ఎక్సైజ్ శంషాబాద్ ఎస్‌టీఎఫ్ టీమ్ దాడులు నిర్వహించింది. ఈ దాడిలో 25 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్, 8 గ్రాముల విదేశీ ఓజీ కుష్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్‌ను విక్రయిస్తున్న అబ్దుల్లాబిన్ అజీజ్ బర్వాజ్, మహ్మద్ ఖలీంలను అరెస్టు చేశారు. వీరి వద్ద బైక్, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కాగా.. ప్రధాన నిందితుడు రషీద్ అలీఖాన్ పరారీలో ఉన్నట్లు టీమ్ లీడర్ పవన్‌కుమార్ తెలిపారు. అనంతరం పోలీసులు విచారించగా.. ఈ ముగ్గురు వ్యక్తులు డ్రగ్స్‌ను గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, మణికొండ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పరిధిలో అమ్మకాలు జరుపుతున్నట్లు తేలింది. ఈ ముఠాపై ఇప్పటికే టీజీన్యాబ్‌లో మూడు కేసులు, శేరిలింగంపల్లిలో రెండు కేసులు ఉన్నాయని తెలిపారు.

మరో కేసులో 2.6 కేజీల గంజాయి..

గొల్కొండ, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఎస్‌టీఎఫ్ సీఐ వెంకటేశ్వర్లు టీమ్ సభ్యులు కలిసి 2.6కేజీల గంజాయి పట్టుకున్నారు. ఎస్టీఎఫ్‌సీ టీమ్ సీఐ చంద్రశేఖర్ టీమ్ సభ్యులు రెండు కేసుల్లో 2.6 కేజీల గంజాయిని పట్టుకున్నారు. గొల్కొండ ప్రాంతంలో 1.1 కేజీల గంజాయి, కుత్బుల్లాపూర్ ప్రాంతంలో 1.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు కేసుల్లో మహ్మద్ అస్లమ్, మహ్మద్ నజీర్‌లను అరెస్టు చేశారు.

రేపు, ఎల్లుండి మత్స్యకార మహిళల జాతీయ సదస్సు

రాంనగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మత్స్య మహిళ జాతీయ సదస్సు, జాతీయ కార్యవర్గ సమావేశాలు ఈ నెల 8, 9వ తేదీలలో నగరంలోని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు అఖిల భారత మత్స్యకారులు, మత్స్య కార్మిక సమాఖ్య జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ తెలిపారు. గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలోని మత్స్య మహిళల సమస్యలపై చర్చించడానికి జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ కె.హేమలత, అఖిల భారత మత్స్యకారులు, మత్స్య కార్మిక సమాఖ్య జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు దేబుశేష బర్మన్, పి.స్టాన్లీ, కేరళ రాష్ట్ర మత్స్యశాఖ ఫెడరేషన్ చైర్మన్ టి.మనోహరన్ తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో మత్స్య సంఘం నాయకులు బక్కి బాలమణి, చంద్ర పుష్ప, కె.పుష్పలత, నవనీత, బి.లక్ష్మి, నీలగిరి రజనీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీగణపతి ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాటు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయం నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటైంది. 17 మంది సభ్యులతో కమిటీని ప్రకటిస్తూ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం ఉదయం ఆలయంలో నూతన కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేస్తారని కమిటీ సభ్యులు మారిశెట్టి నర్సింగ్‌రావు వివరించారు..



మల్లేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న రాజ్‌కుమార్

పద్మశాలీ సంఘం గ్రేటర్ కన్వీనర్‌గా మల్లేష్

ముషీరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీ సంఘం గ్రేటర్ కన్వీనర్‌గా సి.మల్లేష్ నియమితులయ్యారు. గురువారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజ్‌కుమార్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ గ్రేటర్ పరిధిలోని పద్మశాలీలను ఏకతాటిపైకి తీసుకువచ్చి, న్యాయమైన డిమాండ్ల సాధనకోసం కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమలో బాల్‌రాజ్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.